క్లుప్తంగా

శివ మాలధారులకు అన్నదానం



వేలేరు : మండల కేంద్రంలోని రుద్రరామేశ్వర ఆలయంలో శివ మాలధారులకు మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ దంపతులు అన్నదానం చేశారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని ప్రతీ ఏడాది మాలాధరులకు అన్నదానం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సలీంమాలీక్ తదితరులు పాల్గొన్నారు.

పార్క్ చేసిన బైక్‌ల చోరీ



కాజీపేట : కాజీపేట పట్టణంలో ఇంటి ఆవరణలో పార్క్ చేసిన పలు ద్విచక్ర వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించడం చర్చనీయంశంగా మారింది. బాధితుల కథనం ప్రకారం.. గురువారం తెల్ల వారుజామున ఇళ్లలోకి ప్రవేశించి పార్క్ చేసిన బైక్‌లను చోరీ చేశారు. జూబ్లీమార్కెట్‌లో ఫొటోగ్రాఫర్ రాయిస్‌కు చెందిన బైక్, సోమిడిలో రైల్వే ఉద్యోగికి చెందిన ద్విచక్రవాహనం, విష్ణుపురిలో గొని సాంబయ్య స్కూటీతో దొంగలు పరారయ్యారు. గొని సాంబయ్య ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేసి సోమిడిలో వదిలేసి పోయారు. దొంగల కదలికలు సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో క్రైమ్‌బ్రాంచ్ పోలీసులు వివరాలు సేకరించి విచారణ చేపట్టారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

వరంగల్ : ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువకుడు మద్యానికి బానిసై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ ఏ.రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం..బాలాజీనగర్‌కు చెందిన జక్కోజు శివకృష్ణచారి (31) కూలీ పని చేస్తూ మద్యానికి బానిసై రోజు ఇంట్లో భార్యతో గొడవ పడేవాడని అన్నారు. ఈక్రమంలో బుధవారం సాయంత్రం మృతుడి భార్య, తల్లి ఇంటి ఎదుట ఉండగా అతిగా మద్యం తాగి వచ్చి ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడని చెప్పారు. అయితే పడుకున్నాడు అని అనుకొని కొద్దిసేపటి తర్వాత తలుపులు తీయకపోతే కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య లావణ్య ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాఘవేందర్ వివరించారు.

సట్టా స్థావరంపై దాడి

- రూ.6,330ల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం, కేసు నమోదు

ఖిలా వరంగల్ : ఆన్‌లైన్‌లో రహస్యంగా ఆడుతున్న సట్టా స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి రూ.6,330ల నగదు, స్మార్ట్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి పడమరకోట పద్మశాలి వీధిలో ఓ ఇంట్లో ఆన్‌లైన్ సట్టా రహస్యంగా ఆడుతున్నట్లు సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ రాజు గురువారం సాయంత్రం సట్టా స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో కామని హరీశ్‌ను అదుపులోకి తీసుకుని, అతని నుంచి రూ.6,330ల నగదు, స్మార్ట్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హరీశ్‌పై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు కేసును అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

లైబ్రరీకి పుస్తకాల వితరణ

హన్మకొండ చౌరస్తా : హనుమకొండలోని జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఉపాధ్యాయురాలు వెలిదండి సుమలత పుస్తకాలు వితరణ చేశారు. ఈ మేరకు గురువారం గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్‌కు పుస్తకాలను అందజేశారు. కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ నేషనల్ బుక్ ట్రస్ట్‌లో శాశ్వత సభ్యత్వాన్ని కల్పిస్తూ రూ.10 వేల విలువైన పుస్తకాలను సుమలతకు పంపించారు.

నేడు కేయూలో వర్క్‌షాప్

కేయూ క్యాంపస్ : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కాకతీయ యూనివర్సిటీలో నేడు (శుక్రవారం) ఉదయం 10:30గంటలకు సెనేట్‌హాల్‌లో ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.మనోహర్ గురువారం తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కాకతీయ యూనివర్సిటీలోని స్టూడెంట్స్ వెల్ఫేర్ సెంటర్ ఆధ్వర్యంలో వరంగల్ మెడికవర్ ఆస్పత్రి సహకారంతో నేడు (శుక్రవారం) ఉదయం 7:30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సమ్మక్క ఉమెన్స్ హాస్టల్ వద్ద మహిళల కోసం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు స్టూడెంట్స్ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ నిరంజన్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

శాస్త్రీయ సమాజ స్థాపనే జేవీవీ లక్ష్యం



విద్యార్థులకు చెకుముకి పరీక్షలు నిర్వహిస్తున్న జేవీవీ ప్రతినిధులు (ఫైల్)



సూర్యగ్రహణాన్ని చూస్తున్న ప్రజలు, చిన్నారులు (ఫైల్)

- సైన్స్‌పై విస్తృత ప్రచారం చేస్తున్న జనవిజ్ఞాన వేదిక
- 1988లో ఆవిర్భావించిన సంస్థ
- నేటితో 37 ఏళ్లు పూర్తి
- నేడు సైన్స్ దినోత్సవం



శాస్త్రీయ విధానాన్ని వివరిస్తున్న జేవీవీ ప్రతినిధి (ఫైల్)

ధర్మసాగర్ : సామాన్య ప్రజానికంలో శాస్త్ర ప్రచారం చేస్తూ రాజ్యాంగం నిర్దేశించిన శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజలు అలవరచుకునేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోంది. 1988 ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, శాంతి కోసం సైన్స్, దేశ స్వావలంబన కోసం సైన్స్ అనే నినాదాలతో ప్రారంభమై 37 ఏళ్లుగా ప్రజా చైతన్య ఉద్యమాలను చేపట్టి ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడంలో జనవిజ్ఞనవేదిక ముఖ్యపాత్ర పోషిస్తోంది. శాస్త్ర పరిశోధనలో భారత నోబెల్‌గా పిలిచే శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డులు పొందిన శాస్త్ర వేత్తలతో పాటు వివిధ పరిశోధన సంస్థల్లో పనిచేసే శాస్త్రవేత్తలు, డాక్టర్లు ప్రతిష్టాత్మక విద్యా సంస్థల ఆచార్యులు, ఉపాధ్యాయులు, వివిధ రంగాలకు చెందిన వృత్తి నిపుణులు, కళాశాలలు యూనివర్సిటీల విద్యార్థులతో 50 వేలకు పైగా సభ్యత్వం కలిగి సైన్స్ ప్రచార సంస్థగా ఎదిగింది. సైన్స్‌కు సంబంధించి ఏ అంశంపై అయినా అవగాహన కల్పిస్తూ మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు జనవిజ్ఞాన వేదిక పనిచేస్తోంది. రాష్ట్రంలో విద్య, ఆరోగ్యం, శాస్త్ర ప్రచారం, ప్రజా కళలు, పర్యావరణం, చెకుముఖి ప్రచురణలు, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కల్పిస్తూ పలువురుకి ఆదర్శంగా నిలుస్తోంది. పాఠశాల విద్యాబోధనలో సృజనాత్మక, నూతన విధానాన్ని ఆవిష్కరించి వేలాదిమంది సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చింది. అశాస్త్రీయ వైద్య విధానాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజారోగ్యం గురించి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నది. పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో భాగంగా ప్రచురణలు, ఎగ్జిబిషన్స్, సదస్సులు చేపట్టి ప్రజలతో మమేకమవుతున్నది. జనవిజ్ఞాన వేదిక శాస్త్ర ప్రచారంలో చేస్తున్న కృషిని గుర్తించిన భారత ప్రభుత్వం.. 2005వ సంవత్సరంలో జాతీయ అవార్డు ప్రకటించింది. జనవిజ్ఞాన వేదిక సంస్థ ఆవిర్భావించి నేటికి 37 పూర్తిచేసుకోగా ఆ సంస్థ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విజ్ఞాన శాస్త్ర ఫలాలు అందరికీ అందాలి



మనిషి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునే శక్తి మనిషికే ఉంది. ఆ సమస్యల పరిష్కరాలు కూడా సమాజంలోనే ఉన్నాయి. మానవులు ఎదుర్కొంటున్న సమస్యలను శాస్త్రీయంగా పరిష్కరించినప్పుడే విజయం సాధ్యమవుతుంది. సామాజిక అంశాల విశ్లేషణ, అధ్యయనాలను శాస్త్రీయ, హేతుబద్ధ దృక్పథంతో చేసే ఆలోచనను ప్రజలకు కలించేందుకు కృషి చేస్తున్నదే జనవిజ్ఞాన వేదిక సంస్థ. మూడున్నర దశాబ్దాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు శాస్త్ర విజ్ఞాన ఫలాలు అందాలనే ధ్యేయంతో ముందుకెళ్తోంది. ఇందులో అందరూ భాగస్వాములు కావాలి.

– ధర్మప్రకాశ్, జేవీవీ పర్యావరణ విభాగం కన్వీనర్

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. కమలాపూర్ మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఎమ్మెల్సీకి 2,188 ఓట్లకు గాను 73.44 శాతంతో 1,607 ఓట్లు పోలవగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 80 ఓట్లకు గాను 97.5 శాతంతో 78 ఓట్లు పోలైనట్లు ఎన్నికల సెక్టోరల్ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. అలాగే ఎల్కతుర్తి మండలంలో పట్టభద్రుల పోలింగ్ 83.35 శాతం నమోదు కాగా టీచర్స్ పోలింగ్ 96.55 శాతం నమోదైనట్లు తహసీల్దార్ జగత్‌సింగ్ తెలిపారు. భీమదేవరపల్లి మండంలో పట్టభద్రుల పోలింగ్ 71శాతం నమోదు కాగా, ఉపాధ్యాయ పోలింగ్ 84శాతం నమోదైనట్లు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అలాగే పరకాల డివిజన్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ 95.028 శాతం నమోదు అయినట్లు పరకాల ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ తెలిపారు. అత్యధికంగా ఆత్మకూరు మండలంలో 100 శాతం పోలింగ్ నమోదు అయ్యిందని, అత్యల్పంగా దామెర మండలంలో పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. అలాగే వివిధ మండలాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాలను పోలీస్ అధికారులు పర్యవేక్షించి బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



పరకాల : బందోబస్తును పర్యవేక్షిస్తున్న డీసీపీ రవీందర్



శాయంపేట : పర్యవేక్షిస్తున్న ఏసీపీ సతీశ్‌బాబు



ఎల్కతుర్తి : క్యూలైన్‌లో పట్టభద్రులు



ఆత్మకూరు : పోలింగ్ సామగ్రిని తరలిస్తున్న తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, సిబ్బంది



వేలేరు : ఓటింగ్ పూర్తికాగా పోలింగ్ సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది



కమలాపూర్ : చంటిపిల్లలతో క్యూలైన్లో నిల్చున్న మహిళా పట్టభద్రులు



కమలాపూర్ : పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న డీసీపీ సలీమా



ఆత్మకూరు : ఓటర్ స్లిప్‌ను పరిశీలిస్తున్న సీఐ సంతోశ్



కమలాపూర్ : ఓటు వేసేందుకు బారులుదీరిన పట్టభద్రులు

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

ఐనవోలు : వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 7వ తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం డాక్టర్ రమేశ్ తెలిపారు. కాగా గురువారం పాఠశాలలో విద్యార్థులు కె.కృతిక, ఆర్.వర్షిత, ఎం.నిహారిక, ఎం.సాత్విక్, బి.కార్తికేయను అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు పద్మావతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2 వరకు సిద్దిపేటలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో సైతం ప్రతిభ కనబర్చి రాణించాలని కోరారు.

క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దు

వరంగల్ : విద్యార్థులు క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలతో ప్రాణాలు తీసుకోవద్దని అసోసియేట్ డీన్–2 ఎం.వెంకట్‌రెడ్డి విద్యార్థులను కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ(హానర్) అగ్రికల్చర్ చదువుతున్న విద్యార్థి జి.రేష్మిత కోర్సుపై అయిష్టంతో తల్లిదండ్రులకు దూరంగా ఉండడం భరించలేక క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడడం తీవ్ర మనస్తాపానికి గురి చేసిందని ఎం.వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం వ్యవసాయ కళాశాలలో రేష్మిత ఆత్మశాంతి కలగాలంటూ సంతాపసభను నిర్వహించారు. సభలో అధ్యాపకులు డాక్టర్ సల్ల సౌజన్య, హేమశరత్, బి.విద్యాధర్ పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట

- వైభవంగా దర్గా ఉర్సు
- దర్గాను దర్శించుకున్న టీపీసీసీ కార్యదర్శి ఎండీ ఆయూబ్, దర్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్



దర్గాలో పూజలు చేస్తున్న ఆయూబ్, జబ్బార్

ఖిలా వరంగల్ : ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీపీసీసీ కార్యదర్శి ఎండీ అయూబ్, ఖాసీం షాహిద్, దర్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ అన్నారు. గురువారం వరంగల్ ఫోర్ట్ రోడ్డు ఏకశిలా నగర్‌లోని హజ్రత్ సయ్యద్ అబ్దుల్లా ఖాసీం షాహిద్ దర్గా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ ఆధ్వర్యంలో ఉర్సు వైభవంగా జరిగింది. వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఖిలావరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లోని ఈద్గా మసీద్ నుంచి పురవీధుల్లో జెండాను ఊరేగిస్తూ మతాలకు అతీతంగా ముస్లింలు నృత్యాలు, ఫకీర్ల విన్యాసాలు చేయగా.. సందల్ ఊరేగింపు నిర్వహించారు. దర్గా అధ్యక్షుడు జబ్బార్ గంధం, జెండాను ఊరేగింపుగా తీసుకొస్తుండగా ముస్లింలు ఎదురేగి మొక్కలు సమర్పించుకున్నారు. ముస్లిం మతపెద్దలు మహమ్మద్ నౌమాన్ రజా సమాధికి గంధాన్ని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు సహకారాలతో దర్గా అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం దర్గా కమిటీ బాధ్యులు మహా అన్నదానం నిర్వహించారు. ఎండీ ముస్తఫా, ఎండీ అష్రఫ్, ఆరిఫ్, చంద్‌పాషా, మాషూక్, సర్వర్, సాలార్, హైమద్‌ఖాన్, హజారొద్దీన్, హుస్సేన్ అలీబేగ్, దస్తగిరి, జానీ, ఖాజా, ముంతాజ్, సలాయొద్దీన్, రఫీక్, జమీల్, యాకూబ్, అమ్జద్, షర్ఫొద్దీన్, ఫసీ, భక్తులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న తమను కాంట్రాక్టు అధ్యాపకులుగా అవకాశం కల్పించాలని పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబుతో పాటు తదితరులు వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రంను కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెగ్యులర్ కోర్సుల్లో పనిచేస్తున్న 79మంది, ఎస్ఎఫ్‌సీ కోర్సుల్లో పనిచేస్తున్న 57మంది పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా నియమించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఎప్పటి నుంచే అవకాశం వేచిచూస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలకమండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు, పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం బాధ్యులు తిరుణహరిశేషు, దేవోజీనాయక్, రాజేందర్, భిక్షపతి, బాలకృష్ణ, శ్రీధర్, ఎర్రబొజ్జు రమేశ్, శంకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిగుండాలపై నడిచి.. భక్తిని చాటుకుని



శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అగ్నిగుండం

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో గల అతి పురాతనమైన కాకతీయుల నాటి శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మహా శివరాత్రి ఉత్సవాలు బుధవారం అర్ధరాత్రి వరకు వైభవంగా కొనసాగాయి. అర్ధరాత్రి 2గంటలకు అగ్ని గుండాలు ఏర్పాటు చేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అగ్ని గుండాలపై నడిచి భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ తాటిపాముల అనుదీప్‌శర్మ, మాజీ సర్పంచ్ అబ్బు ప్రకాశ్ రెడ్డి, జాగృతి యువత రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్, తడక ఈశ్వర్, కోత్వాల్ కిరణ్, వావిలాల రాజేందర్, మోహన్, సాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాబార్డు అధికారుల సందర్శన



సొసైటీ ఫంక్షన్‌హాల్‌ను సందర్శించిన నాబార్డు అధికారులు, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు

ఐనవోలు: నందనం సొసైటీ పరిధిలో చేస్తున్న కార్యక్రమాలను నాబార్డు అధికారులు గురువారం సందర్శించారు. సొసైటీ పరిధిలో ఇస్తున్న రుణాలు, డిపాజిట్ల సేకరణ తదితర అంశాలను పరిశీలించారు. సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మార్ట్ ఫంక్షన్ హాల్, సొసైటీ కార్యాలయాలను సందర్శించి సొసైటీ బిజినెస్ డెవలప్‌మెంట్ గురించి సలహాలు సూచనలు ఇచ్చారు. ఎంఎస్‌సీ కొత్త యాక్టివేషన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. సొసైటీ పరిధిలో వరి పంటను ఆరబెట్టే అధునాతన డ్రయ్యర్, గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటు, సోలార్ యూనిట్లు నెలకొల్పడం తదితర బిజినెస్‌పై ఆసక్తి ఉంటే అందుకు తగిన ప్రపోజల్స్ సిద్ధం చేసుకుని సంప్రదించాలని సూచించారు. నాబార్డు జీఎం రమేశ్, తెలంగాణ రీజనల్ ఆఫీసర్ కామేశ్వర్‌రావు, అధికారులు నితిధి తివారీ, నాబార్డు డీడీఎం చంద్ర శేఖర్, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, డీసీసీ బ్యాంక్ అధికారులు శ్రవణ్, గణేశ్, సొసైటీ సీఈఓ సంపత్ పాల్గొన్నారు.

ప్రహరీ పక్కనే చెత్తకు నిప్పు..



ప్రహరీ పక్కన చెత్తను కాలుస్తున్న సిబ్బంది

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రహరీ చుట్టుపక్కల పాఠశాల సిబ్బంది చెత్తను, కోడిగుడ్డు పొచ్చెలను కుప్పలుగా పోసి కాలుస్తున్నారు. దీంతో క్లాస్‌రూంలోకి పొగ వ్యాపించి విద్యార్థినులు శ్వాసకోశకు గురయ్యే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ పాఠశాల సిబ్బంది తీరులో మార్పు రావడం లేదని పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రిన్సిపాల్ ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మల్లికార్జునుడికి ఘనంగా పెద్దపట్నం



గట్టు మల్లన్నకు పెద్దపట్నం వేస్తున్న ఒగ్గుపూజారులు

వేలేరు : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని మల్లికుదుర్ల గట్టు మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారి కల్యాణం అనంతరం ఒగ్గుపూజారుల సమక్షంలో ప్రారంభమైన మల్లన్న పెద్దపట్నం తెల్లవారుజాము వరకు కొనసాగింది. ఆలయ అర్చకులు స్వామివారి ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి పెద్దపట్నం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు పట్నం దాటిన అనంతరం భక్తులు మల్లన్నను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వినయ్‌శర్మ, మహేష్, ఒగ్గు పూజారులు అమరగొండ సాంబరాజు పాల్గొన్నారు.

నల్లమారెమ్మ వాగు హద్దుల ఏర్పాటుకు సర్వే



క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టిన ఏడీ శ్రీనివాసులు

ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామంలో గల నల్లమారెమ్మ వాగు హద్దుల ఏర్పాటుకు జిల్లా ఏడీ సర్వేయర్ శ్రీనివాసులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. నల్లమారెమ్మ వాగు, పక్కనున్న రైతు భూమి హద్దుల విషయంలో కొంతకాలంగా గ్రామస్తులు అభ్యంతరం తెలుపుతున్న సంగతి తెలిసిందే. సదరు రైతు ఆ భూమిలో ఫంక్షన్‌హాల్ నిర్మిస్తున్నాడు. గతంలో సమస్య పరిష్కారానికి ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. కాగా ఇరిగేషన్ ఈఈ హద్దులను నిర్ణయించాలని జిల్లా సర్వే విభాగం ఏడీకి లేఖ రాశారు. దీంతో గురువారం ఏడీ శ్రీనివాసులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. త్వరలో హద్దులు నిర్ణయించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రొఫెసర్ జనార్దన్‌రావు సేవలు గుర్తించాలి

- ట్రస్టు కార్యదర్శి బుచ్చి బాబురావు



జనార్దన్‌రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బుచ్చి బాబురావు తదితరులు

కేయూ క్యాంపస్ : ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన దివంగత ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావు సేవలను ప్రభుత్వం గుర్తించాలని జనార్దన్‌రావు ట్రస్టు కార్యదర్శి తక్కెళ్లపల్లి బుచ్చిబాబురావు కోరారు. గురువారం ఆ ట్రస్టు ఆధ్వర్యంలో జనార్దన్‌రావు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న ప్రొఫెసర్ జనార్దన్‌రావు విగ్రహానికి బుచ్చిబాబురావు ఇతర బాధ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం జనార్దన్‌రావు సేవలను గుర్తించి స్మారకాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. జనార్దన్ రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో 23ఏళ్లుగా దేశంలోని ప్రముఖ మేధావులతో జనార్దన్‌రావు స్మారక ఉపన్యాసాలు నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు తూముల అభిలాష్‌రావు, ఎల్ఐసీ డెవలప్‌మెంటు ఆఫీసర్ భిక్షపతి నాయక్, సత్యం, ప్రకాశ్‌రావు, డాక్టర్ రాజేష్, టి.వినీల్, డాక్టర్ వీరస్వామి, యతిరాజారావు పాల్గొన్నారు.